క్లుప్తంగా

ఎంఈఓను సన్మానించిన ఉపాధ్యాయులు



అయిజ: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంఈఓ రాములు దయాల్‌ను ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం శాలువాలు, పూల మాలలతో సన్మానించారు. శుక్రవారం ఎంఈఓ భూంపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు భీమేశ్వర్‌రెడ్డి ఎంఈఓను శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో మేడికొండ కాంప్లెక్స్ గెజిటెడ్ హెచ్‌ఎం తిమ్మారెడ్డి, భూంపురం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సహకార ఉద్యోగికి సన్మానం



గట్టు: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులను నిర్వహిస్తూ, ఈ నెలాఖరున పదవీ విరమణ పొందనున్న యరిగేర వెంకటేష్‌ను శుక్రవారం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్, డైరెక్టర్లు వెంకటేష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వెంకటేష్,ఉపాధ్యక్షుడు మహాదేవప్ప, గద్వాల మార్కెట్ యార్డు డైరెక్టర్ బజారి, పీఏసీఎస్ డైరెక్టర్లు రఘుకుమార్‌శెట్టి, తిమ్మప్ప, మహేశ్వర్‌రెడ్డి, రాఘవరెడ్డి, నర్సింహులు, సురేష్, సహకార సిబ్బంది నర్సింహులు, స్థానికులు పాల్గొన్నారు.

రక్త హీనతను దూరం చేద్దాం



గట్టు: గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు రక్త హీనత బారిన పడకుండా పండ్లు, ఆకుకూరలు, కూరగాయలను నిత్యం తీసుకునే ఆహారంలో ఉండాలని ప్రాజెక్టు ఇన్‌చార్జి సీడీపీఓ నాగరాణి కోరారు. శుక్రవారం గట్టులోని రైతు వేదికలో మండల స్థాయిలో పోషణ అభియాన్ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నీతి అయోగ్ జిల్లా కోఆర్డినేటర్ అఫ్జల్, ఎంపీడీఓ చెన్నయ్య, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ కల్యాణ్‌రెడ్డి, వైద్యాధికారి సూర్యప్రకాష్, సూపర్‌వైజర్లు సంధ్యారాణి, వాసంతి, ఏఎన్‌ఎం తాహేరా, ఉమెన్ హబ్ జోష్న, నాగరాజు, అంగన్‌వాడీ టీచర్లు వెంకట్రావమ్మ, ఉమామహేశ్వరి, సుజాతమ్మ, సరస్వతి, రాజేశ్వరి, నారాయణమ్మ, అరుణ, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

ఉప్పేరులో విద్యార్థుల ర్యాలీ



ధరూరు: మండలంలోని ఉప్పేరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సత్యార్థి కైలాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పిల్లల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు అరికట్టేందుకు పాఠశాలలో ఫౌండేషన్ సోషల్ మొబిలైజర్ విజ్ఞులత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం గౌరీశంకర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారు బైక్ ఢీ: ఒకరి పరిస్థితి విషమం

గద్వాల క్రైం: కారు బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరి పరిస్థితి విషమంగా మారిన సంఘటన శుక్రవారం కలెక్టరేట్‌లో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కలెక్టర్ కార్యాలయానికి శ్రీనివాసులు పని నిమిత్తం వచ్చి తిరుగు ప్రయాణంలో కారులో బయటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కృష్ణయ్యగౌడు, ఆంజనేయులు కార్యాలయం వెలుపలికి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో కారు బైక్ ఢీకొని బైక్‌పై ఉన్న కృష్ణయ్యగౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆంజనేయులకు స్వల్ప గాయాలయ్యాయి. ఇరువురి నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని కార్యాలయ సిబ్బంది పేర్కొన్నారు. ఈ సంఘటనపై పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు.

కంది పంట కలిసొచ్చేనా?

- వేల ఎకరాల్లో కంది సాగు
- పత్తికి ధర లేకపోవడంతో పెరిగిన కందిపంట విస్తీర్ణం
- పూత దశకు రాకముందే ఎండిపోతున్న వైనం
- ఆందోళనలో అన్నదాతలు



వడ్డేపల్లి మండలం జూలెకల్ శివారులో ఎండుతున్న కంది పంట



అయిజ మండలం యాపదిన్నె శివారులో ఎండుతున్న కంది పంట

శాంతినగర్: ప్రభుత్వం ఓ పక్క పప్పుదినుసుల సాగు చేయమని ప్రోత్సహించడం, మరో పక్క పత్తికి గిట్టుబాటు ధర లేకపోవడంతో అలంపూర్ నియోజకవర్గ రైతులు కందిసాగుపై దృష్టిసారించారు. దీంతో ఆయా మండలాల్లో వేల ఎకరాల విస్తీర్ణంలో కంది పంట సాగు చేశారు. పదిహేను రోజులుగా కందిపంట ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పూత దశకు రాకముందే కంది పంట ఎండిపోవడమేంటని వ్యవసాయశాఖ అధికారులు, పురుగుమందుల దుకాణాల చుట్టూ రైతులు తిరుగుచున్నారు. వర్షాలు ఎక్కువగా కురవడం వల్ల ఎండిపోతున్నాయని అధికారులు చెబుతున్నారు. అటు పెట్టిన పెట్టుబడి రాక ఇటు చేసిన శ్రమకు తగ్గ ఫలితం రాకపోతే పూటగడిచే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు, ప్రభుత్వం స్పందించి ఎండిపోయిన పంటను పరిశీలించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కంది పంట సాగు వివరాలు..

అలంపూర్ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లోని మెట్ట పొలాలు, ఆర్డీఎస్ పరివాహక ప్రాంతాల్లో వేల ఎకరాల్లో రైతులు కందిపంట సాగు చేశారు. ఒక్కో మండలంలో సుమారు 3 నుంచి 5 వేల ఎకరాల్లో మొత్తం సుమారు 30 వేల ఎకరాల్లో కందిపంట సాగు చేశారు. కందిపంట ఇటీవల ఎండుతూ వస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈఏడాది కంది పంట పండే అవకాశం ఉందని, ధర రూ.10 వేల వరకు ఉండటంతో రైతులు కంటికి రెప్పలా పంటను కాపాడుతూ వచ్చారు. ఇటీవల పంట ఎండుతుండటంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేలల్లో పెట్టుబడులు..

భారీ వర్షాలు కురవడంతో గడ్డితో పాటు పంటలకు చీడపీడలు ఆశించాయి. దీంతో కలుపు నివారణకు కూలీలతో పాటు గడ్డి మందులు అధికంగా వాడాల్సి వచ్చింది. కందిపంట ఎండుతుందనే ఆందోళనలో బాక్టీరియా, పురుగుమందులు ఎక్కువసార్లు పిచికారీ చేయడంతో పెట్టుబడి ఖర్చులు పెరిగాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుండె తరుక్కుపోతోంది..



నాకున్న రెండెకరాల్లో సాగు చేసిన కందిపంట కళ్లెదుటే ఎండిపోతుంటే గుండె తరుక్కుపోతోంది. వర్షాలు ఎక్కువగా కురవడంతో ఇంటిల్లిపాది, కూలీలతో కలుపు మొక్కలు తీయించాం. కందిపంట ఎండిపోతుందని పురుగులు, బాక్టీరియాకు సంబంధించిన మందులు చాలా సార్లు పిచికారీ చేశాం. పంట ఎండుముఖం పట్టి పండే పరిస్థితి కనిపిస్తలేదు. అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందించాలి.

– సత్యన్న, రైతు, జూలెకల్, వడ్డేపల్లి

వేలల్లో పెట్టుబడులు పెట్టాను..



నేను 8 ఎకరాల్లో కందిపంట సాగుచేశాను. కందిపంట బాగుందని ఇప్పటికే రూ.80 వేలు పెట్టుబడులు పెట్టాను. పదిహేను రోజులుగా పంట ఎండుతూ వస్తోంది. పురుగుల మందు దుకాణాలకు వెళ్లి మందులు తెచ్చి స్ప్రే చేస్తున్నాను. పంట ఎండుతూనే ఉంది. ఏమి చేయాలో తోచడంలేదు.

– సుందర్‌రెడ్డి, రైతు, యాపదిన్నె, అయిజ

అధిక వర్షాల వల్లే..



ఈఏడాది భారీ వర్షాలవల్లే కంది పంట ఎండుతోంది. తగ్గుప్రాంతాల్లో నీరు నిలిచి వేర్లు కుళ్లిపోయి ఎండుతున్నాయి. నీరు నిల్వ ఉండకుండా చూడాలని రైతులకు సూచిస్తున్నాం. పంట నష్టపరిహారం విషయమై ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– సక్రియానాయక్, ఏడీఏ, అలంపూర్

కలిసికట్టుగా అభివృద్ధికి కృషి చేద్దాం

మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ



అలంపూర్‌లో సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ

అలంపూర్: కలిసికట్టుగా మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకుందామని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. అలంపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ సరస్వతి, కౌన్సిలర్లు, వార్డు అధికారులు హాజరయ్యారు. సమావేశంలో మున్సిపాలిటీలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఈ క్రమంలో కొంత మంది కౌన్సిలర్లు మున్సిపాలిటీలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో కౌన్సిలర్లకు వార్డు సభ్యుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ నచ్చజెప్పడంతో వాగ్వివాదం సద్దుమణిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆయా వార్డులోన్ని కాలనీల ప్రజలకు తాగునీటి, పారిశుద్ధ్య ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల సహకారంతో పెండింగ్‌లో ఉన్న రోడ్లను త్వరగా పూర్తి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, మున్సిపల్ టౌన్ ప్లానర్ కురుయ్య, కౌన్సిలర్లు పుష్పలత, జయలక్ష్మి, లక్ష్మీదేవమ్మ, సుష్మారావు, సఖినాబీ, సుదర్శన్ గౌడు, ఇంతియాజ్, కో–ఆప్షన్ సభ్యులు నాగలక్ష్మమ్మ, ఖలీదా బేగం, అల్లబకాష్, మున్సిపల్ వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు



పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



రాజోళిలో కార్మికులకు శానిటైజర్లు అందచేస్తున్న ఎంపీడీఓ ఖాజామొయినుద్దీన్

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి వడ్డేపల్లి పీహెచ్‌సీ వైద్యులు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ లక్ష్మారెడ్డి తెలిపారు. వారికి అవసరమైన మాత్రలు, రేడియం జాకెట్లు, చేతులకు గ్లౌజ్‌లు, పంపిణీ చేశారు. ప్రతినిత్యం పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, వార్డు కౌన్సిలర్లు, పీహెచ్‌సీ డాక్టర్ హేమ మానస, పీహెచ్‌సీ సిబ్బంది, జూనియర్ అసిస్టెంట్లు ఈదన్న, నర్సింహులు, వీరబాబు పాల్గొన్నారు.

మల్దకల్: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ స్వరూపరాణి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి ఆవరణలో పెరిగిన కంపచెట్లు, ముళ్లపొదలు తొలగించారు. కార్యక్రమంలో డాక్టర్ జయమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీధర్, వెంకటస్వామి, ఏఎన్‌ఎంలు, ఆశాలు ఉన్నారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో డాక్టర్ సింధు ఆధ్వర్యంలో నీటిని నిల్వ ఉంచరాదని సూచించారు. ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించారు.

ధరూరు: మండలంలోని ఓబులోనిపల్లిలో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి వసంత్ గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి ఉంచాలని ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్ అన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్‌బాపూజీకి ఘన నివాళి



గద్వాలలో బాపూజీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ కేశవ్



కేటీదొడ్డిలో లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది



అలంపూర్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

గద్వాలటౌన్: తెలంగాణ పోరాట యోధుడు, రాష్ట్ర మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు, వివిధ సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పద్మశాలి సంఘం నాయకులు జిల్లా ఆస్పత్రిలో అన్నదానం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీలోని ఎమ్మెల్యే వర్గం, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత వర్గం నాయకులు వేరువేరుగా నివాళులర్పించారు. బీజేపీ నాయకులు నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడారు

కేటీదొడ్డి: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్ ఆధ్వర్యంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ దేవేందర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది భీమయ్య, తిరుపతి, గణపతిఉన్నారు.

అయిజ: మండల కేంద్రంలో అఖిలపక్ష కమిటీ నాయకులు భగత్‌సింగ్, కొండా లక్ష్మణ్ బాపూజీల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజోళి: మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాంధీ చౌక్‌లో చేనేత కార్మికుల ఆధ్వర్యంలో బాపూజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దస్తగిరి, మూగెన్న, మాజీ ఉప సర్పంచ్ గోపాల్, మాజీ ఎంపీటీసీ గంగి రెడ్డి, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

అలంపూర్: దేశానికి రాష్ట్రానికి కొండ లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. అలంపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, కమిషనర్ సరస్వతి బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లుఉన్నారు.

గట్టు: గ్రామ పంచాయతీ దగ్గర, తహసీల్దార్ కార్యాలయంలో కొండాలక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరితారాణి, ఆప్కో మాజీ డైరెక్టర్ దోమ వీరన్న, చేనేత కార్మికులు లక్ష్మీనారాయణ, జయన్న, కృష్ణ, జయరాములు, శేఖర్ పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

గద్వాల అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, నాన్ పర్మినెంట్ కార్మికులకు, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాతహౌసింగ్‌బోర్డు కాలనీలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ఆయా రంగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నర్సింహ, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గట్టన్న, ఉద్యోగులు మహస్త్రష్, లక్ష్మీప్రసాద్, హరిశంకర్, సురేష్, తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తాం



నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయిస్తున్న ఏఈ నరేందర్ రెడ్డి

అయిజ: కాలం చెల్లిన విద్యుత్ పరికరాలను తొలగించి, కొత్త పరికరాలు ఏర్పాటు చేసి, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తామని ఏఈ నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటాపురంలోని ఎస్సీ కాలనీలో కాలం చెల్లిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

దాడులను ఖండిస్తున్నాం



కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేటు స్కూల్స్ ఉపాధ్యాయులు

గద్వాల అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ స్కూల్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, డ్రైవర్లపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏమైనా సంఘటనలు జరిగిన క్రమంలో చట్టబద్ధంగా బాధ్యులను శిక్షించాలని, భౌతిక దాడులు చేయడం సరికాదని తెలిపారు. ప్రైవేట్ స్కూల్‌లలో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి రక్షణగా ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకోరావాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

గద్వాల అర్బన్: ప్రైవేట్ స్కూల్‌లో పని చేసే ఉపాధ్యాయులకు, బస్సు డ్రైవర్లకు రక్షణ కల్పించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీరా, బస్సు డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు చాంద్ పాష కోరారు. జిల్లా కేంద్రంలోని అక్షర స్కూల్ ఉపాధ్యాయుడిపై, బస్సు డ్రైవర్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ శుక్రవారం జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లను బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయులు, బస్సు డ్రైవర్లు జిల్లా కేంద్రంలో ర్యాలీ చేపట్టి కలెక్టరేట్‌కు చేరుకొని కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాస్‌లకు వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయులు, బస్సు డ్రైవర్లపై జరిగే దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రభుత్వం రక్షణ కల్పించాలని, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

మానవపాడు: ఉపాధ్యాయులు, డ్రైవర్లపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం అధ్యక్షులు వీర తెలిపారు. మండల కేంద్రంలో వివిధ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు తహసీల్దార్ వాహిదా ఖాతూన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, డ్రైవర్స్, తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: ప్రైవేటు స్కూల్స్ బస్సు డ్రైవర్లపై దాడి సంఘటనపై తహసీల్దార్ హరికృష్ణకు, పోలీస్ స్టేషన్‌లోని హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేసి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలో మద్దతుగా ప్రైవేట్ పాఠశాలలు బంద్ చేశారు. కార్యక్రమంలో శ్రీరాములు, మద్దిలేటి, జహింగీర్ బాషా, దామోదర్, రవి, కాశీం, మహబుబ్ భాషా, రామకృష్ణ, పరుషగౌడు, రవిశంకర్ పాల్గొన్నారు.

రాజోళి: గద్వాలలో బస్సు డ్రైవర్లు, సిబ్బందిపై దాడి పట్ల వారు మండల కేంద్రంలో నిరసన తెలిపి తహసీల్దార్ పి.రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సుమేధా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



గట్టులో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్

గట్టు: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో యువత కీలకపాత్రను వహించాలని మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ కోరారు. శుక్రవారం గట్టులో ఉన్నత పాఠశాలలో ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో యువత పాత్ర అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ మాట్లాడారు. మండలంలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు యువత చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ సాయికుమార్, గట్టు ఇన్‌చార్జ్ సదానందం, ఉపాధ్యాయుడు నర్సింహులుగౌడు, కానిస్టేబుల్ వెంకటేష్, యువకులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే విజయం తథ్యం

గద్వాలటౌన్: విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే పరీక్షలలో విజయం సాధించవచ్చని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ షేక్ కలందర్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం డిగ్రీ కళాశాలలోని బీఎస్సీ లైఫ్ సైన్స్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు వెల్‌కం పార్టీ ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఉన్నతస్థానంలో ఉండాలనే లక్ష్యాలను నిర్దేశించుకొని పట్టుదలతో సాధించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ చంద్రమోహన్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ షేక్ కలందర్ బాషా

విద్యా వికాసంతో సమాన అవకాశాలు



ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆట వస్తువులు అందజేసిన హనుమంతు

కేటీదొడ్డి: విద్యా వికాసంతో బాలికలకు, బాలురకు సమాన అవకాశాలు ఉండాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ నల్ల హనుమంతు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాఠశాలలో ఎంవీఎఫ్ ఆధ్వర్యంలోని మండల అధికారులు వాల్‌పోస్టర్ విడుదల చేసి, విద్యార్థులకు ఆట వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా నల్ల హనుమంతు హాజరై మాట్లాడారు. మండలంలోని చాలా గ్రామాల్లో బాలికలను పదో తరగతి వరకు చదివించి, ఉన్నత చదువులు వెళ్లకుండా మాన్పిస్తున్నారని, బాలికలను, అబ్బాయిలతో పాటు సమాన హక్కు కల్పించే విధంగా కృషి చేయాలన్నారు. డీటీ శివశంకర్ మాట్లాడుతూ బాలబాలికల విద్య కోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని, ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలలో 100శాతం హాజరు పెంచే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమోహన్, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర, నాయకులు టీచర్ గోవిందు, యుగందర్‌గౌడు, కిరణ్, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

సేవ చేసే చేతులకు అండగా ఉందాం



విద్యార్థులకు బ్యాగులు అందచేస్తున్న షేక్ అస్లాం షరీఫ్

రాజోళి: నిత్యం సమాజ సేవలో ఉంటూ నలుగురికి సేవ చేసే చేతులకు మరింత చేయూతగా ఉండాలని షేక్ అస్లాం షరీఫ్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తూ నిత్యం సేవా కార్యక్రమాల్లో పాల్గొనే షేక్ అస్లాం షరీఫ్ శుక్రవారం తన తండ్రి షేక్ ఖాదర్ షరీఫ్ 29వ వర్ధంతి సందర్భంగా మాన్‌దొడ్డిలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో మూడు ప్రభుత్వ పాఠశాలల్లో 625 మంది విద్యార్థులకు బ్యాగులు నోట్ బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ యువత, పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.